

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

APRIL-2013

సంవత్సర చందా రూ.50/-

# సంక్షిప్త వార్తలు

2013 మార్చి 2వ తేదీ శనివారం హైదరాబాద్ కర్మన్‌ఘట్‌లో నిర్మించబడిన **క్రీస్తుసంఘ** ఆలయము ప్రభువు సేవార్థమై ప్రతిష్టింపబడెను. ఆ సందర్భముగా సోదరులు జాషువా గూటం గారు "**ఇదిగో దేవాలయము కంటె గొప్పవాడిక్కడ ఉన్నాడు**"అను అంశము పై గొప్ప ప్రసంగము చేసిరి. పలువురు సువార్తికులు,సంఘ సభ్యులు,మతాశాఖల వారు ఆ కూటమునకు హాజరైరి. సోదరులు వై.కృపాదానం గారు,వారి కుమారుడు,స్థానిక సంఘము కలసి ఈ ఆలయమును నిర్మించుట జరిగినది. ఆలయనిర్మాణములో ఆయన ఎదుర్కొనిన అనేక శోధనలను కృపాదానం గారు వివరించారు. వనస్థలిపురం లోను, కర్మన్‌ఘట్‌లోను యున్న క్రీసుసంఘస్థులకు ఈ ఆలయము గొప్ప సహాయకరముగా యుండునని సోదరులు జాషువా గూటం గారు అభిప్రాయపడిరి. కృపాదానం గారి కుటుంబమును అభినందించిరి. హాజరైన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను.

2013 మార్చి 11నుండి 13వరకు నిడసనమెట్ట గ్రామములో యున్న **క్రీసుసంఘము** తమ 20వ వార్షిక సువార్త సభలను నిర్వహించిరి. ఆ సభలలో టి.ప్రసన్న విజయ కుమార్,యం.సూర్యరావ్,పి.విజయ కుమార్,యమ్.జాన్‌డీన్, కె.సాల్మన్‌రాజు,మరియు జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు మజ్జి కృపారావ్ గారు చక్కటి పాటలను పద్యములను తనమధుర కంఠముతో వినిపించిరి. పరిసర గ్రామములలో యున్న సంఘస్థులు చాలా మంది హాజరై కూటములను జయకరము గావించిరి. సహో॥భాస్కర పౌలు గారు భార భరితమైన ఈ పనిని చక్కగా నిర్వహించిరి. వివిధ గ్రామముల నుండి వచ్చిన సువార్తికులకు, సభ్యులకు స్థానిక **క్రీస్తుసంఘ** సభ్యులు మంచి ఆతిధ్యమిచ్చిరి. సభలు ఘనముగా నిర్వహించబడి ముగించబడెను.

మార్చి 19,20,21 తేదీలలో జాషువా గూటం గారు సతీసమేతముగా ఒరిస్సాలో సువార్త పర్యటన గావించిరి. బరంపురం పట్టణములో ఆయన నలువది సంవత్సరముల క్రితము ప్రారంభించిన క్రీసుపని ఇప్పటికింకను సజీవముగానే యున్నందున ప్రభువును స్తుతించిరి. స్థానిక సువార్తికుడు లక్షీనారాయణతో గారితో కలసి బరంపురం,అర్జిపల్లి,చిక్కలకొండి గ్రామములలో సువార్తకూటములు నిర్వహించిరి. సోదరులు లక్షీనారాయణ గారు అనేక వ్యయ ప్రయాసల కోర్చి ఒరిస్సా రాష్ట్రములో దేవుని పనిని సమర్థవంతముగా నిర్వహించుచున్నారు.

మార్చి 26వ తేదీ మంగళవారము పశ్చిమగోదావరి జిల్లా భీమడోలులో సువార్తికుల సదస్సు జరిగెను. పలువురు సువార్తికులు,స్థానికులు హాజరుకాగా

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | ఏప్రిల్- 2013 | సంచిక - 9


## నోవహు నుండి ఒక పాఠము
## (A Lesson from Noah)

దేవుడు భూమిమీద నరులను చేసిన తరువాత వారు భూమిమీద విస్తరింప నారంభించిరి. కొద్ది కాలము లోనే వారు అక్రమముతో నిండినవారైరి. నరుల చెడుతనము భూమిమీద గొప్ప దనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి వారు భూమిమీద నుండకుండ గొప్ప జలప్రళయముద్వారా ఆయన తుడిచి వేయ నిశ్చయించుకొనెను. అయితే నోవహు యెహోవా దృష్టియందు కృప పొందిన వాడాయెను.

దేవుడు నోవహుతో – సమస్త శరీరుల మూలముగా భూమి బలత్కార ముతో నిండి యున్నది గనుక నా సన్నిధిని వారి అంతము వచ్చి యున్నది; ఇదిగో వారిని భూమితో కూడ నాశనము చేయుదును. చితిసారకపుమ్రానుతో నీకొరకు ఓడను చేసికొనుము. నీవును నీతో కూడ నీ కుమారులును, నీ భార్యయు, నీకోడండ్రును ఆ ఓడలో ప్రవేశింపవలెను అని చెప్పెను. నోవహు అట్లు చేసెను; దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము

యావత్తు చేసెను. అప్పుడు దేవుడు మహాఅగాధ జలముల ఊటలన్నిటిని, ఆకాశపుతూములను విప్పెను. నలుబది పగళ్ళును, నలుబది రాత్రులును ప్రచండ వర్షము భూమిమీదకురిసెను. ఆఓడ లోనికి నోవహును, నోవహు భార్యయు, అతని ముగ్గురు కుమారులును, ముగ్గురు కోడండ్రును మరియు జీవాత్మ గల సమస్త శరీరులతో రెండేసి రెండేసి చొప్పున ప్రవేశించి యుండిరి. జలములు భూమి మీద ప్రచండముగా ప్రబలి మిక్కిలి విస్తరించినప్పుడు ఓడ నీళ్ళమీద నడిచెను. అప్పుడు పక్షులేమి, పశువులేమి, మృగము లేమి, భూమిమీద ప్రాకుపురుగులేమి, భూమిమీద సంచరించు సమస్త శరీరు లేమి, సమస్త నరులేమి చచ్చిపోయిరి. కేవలము ఓడలోనున్న నోవహును, అతని కుటుంబ సభ్యులును, అతనితో కూడనున్న మిగిలిన జీవరాసులును బ్రతికిరి. నూట యాబది దినముల వరకు భూమిమీద నీళ్ళు ప్రచండముగా ప్రబలెను. బయట నేల ఆరిన తరువాత నోవహు ఓడలోనుండి బయటికి వచ్చి యెహోవాకు బలిపీఠము కట్టి దానిపై దహనబలిని ఆయనకు అర్పించెను. ఇట్లు మొదటిసారి భూమి అంతయును గొప్ప జలప్రళయముద్వారా నాశనము కాగా నోవహును, అతని కుటుంబమును మాత్రమే రక్షించబడిరి. ఈ కథనమును మీరు బైబిలునందు ఆదికాండము 6,7,8 అధ్యాయములలో చదువగలరు. నోవహు యొక్క కథనము ఈనాడు మనకొక గొప్ప మాదిరిగా యున్నది. అతని ద్వారా మనము అనేక దైవసత్యములను నేర్చుకొనవలెనని దేవుడు కోరుచున్నారు.

నోవహు జలప్రళయము నుండి భౌతికముగను, ఆత్మీయముగను రక్షింప బడినట్లే మనమును రక్షింపబడవలెను. నోవహు ఓడలో ప్రవేశించినప్పుడు భౌతికముగా రక్షించబడెను. అయితే దుష్టులందరును ఈ ప్రళయములో నాశనము చేయబడినందున వారి పాపముల నుండి కూడ అతడు రక్షింప బడెను. మనము కూడ మన ఆత్మ రక్షణను కొనసాగించుకొనుట అతి ప్రాముఖ్యము. నిజక్రైస్తవుడు పాపమునకు దూరముగా యుండవలెను.

నోవహు దేవుని కృపవలన రక్షింప బడెను. నోవహుతో దేవుడు "నేను సృజించిన నరులను.... భూమిమీద నుండ కుండ తుడిచి వేయుదును; ఏలయనగా నేను వారిని సృజించినందున సంతాపము నొంది యున్నాననెను. అయితే నోవహు యెహోవా దృష్టియందు కృప పొందినవాడాయెను'' అని ఆదికాండము 6:7,8 లో వ్రాయబడి యున్నది. నోవహువలెనే ఇప్పుడు మనము కూడ దేవుని కృపవలననే

రక్షించబడగలము. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీవలన కలిగినదికాదు. దేవుని వరమే" అని అపొ.పౌలు ఎఫెసీ 2:8లో వ్రాసెను.

నోవహు విశ్వాసము వలన రక్షింపబడెను. "విశ్వాసమును బట్టి నోవహు అది వరకుచూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులుగలవాడై తన యింటి వారి రక్షణకొరకు ఒక ఓడను సిద్ధము చేసెను" అని హెబ్రీ 11:7లో వ్రాయబడియున్నది. మనము కూడ విశ్వాసము ద్వారానే రక్షింపబడగలము. "కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగి యుందము" అని రోమా 5:1 చెప్పు చున్నది. "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు" అని గలతీ 3:26 లో చెప్పు చున్నది. మనము రక్షింపబడుటకు విశ్వాసము అవసరమని ఈ వచనములు బోధించుచున్నను, విశ్వాసము ఒక్కటి మాత్రమేచాలునని అవిబోధించుటలేదు.

నోవహు దేవుని మాటలను నమ్ముట మాత్రమే గాక, ఆయనకు విధేయత చూపుట వలన రక్షించబడెను. అప్పటి కింకను భూమిపై ఎన్నడు వర్షము కురియక పోయినను, జలప్రళయమును రప్పించబోవుచున్నానని దేవుడు అతనికి చెప్పగా నోవహు ఆ సంగతిని విశ్వసించెను. మరియు దేవునికి విధేయత చూపుచు అతడు ఒక ఓడను సిద్ధము చేసెను. మనము కూడ దేవునికి విధేయత చూపుట వలన రక్షించబడుదుము. ఏలయనగా యేసుక్రీస్తు దేవుని కుమారుడై యుండి తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. మరియు తనకు విధేయులైనవారి కందరికిని ఆయన నిత్యరక్షణకు కారకుడాయెను అని హెబ్రీ 5:8-10లో వ్రాయబడి యున్నది. మనము దేవుని యందును, యేసుక్రీస్తు నందును విశ్వాసముంచినంత మాత్రమున నే రక్షించబడలేము. విశ్వాసముతోబాటు నోవహు వలెనే మనము విధేయత చూప వలెను.

నోవహు నీటిద్వారా రక్షింపబడెను. "దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టు చుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచుచుండగా అవిధేయులైన వారి యొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను. ఆఓడలో కొందరు, అనగా ఎనిమిదిమంది నీటి ద్వారా రక్షణ పొందిరి" యని 1పేతురు 3:19,20లో వ్రాయబడియున్నది. నోవహు వలెనే మనము కూడ నీటిద్వారానే రక్షణపొందగలము. అందు వలన

1పేతురు 3:21 వ వచనము "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది"యని బోధించుచున్నది. మనము రక్షింపబడవలెనంటే బాప్తిస్మము అవుసరములేదు అని బోధించువారు కొందరున్నారు. అట్టివారు 1పేతురు 3:21 నిగమనించగోర్తాను.

నోవహు ఓడలో యుండుటవలన రక్షింపబడెను. మనము కూడ ఆత్మీయ ఓడయైన సంఘములో యున్న యెడల రక్షింపబడగలము క్రీస్తుసంఘమునకు రక్షకుడై యున్నాడని ఎఫెసీ 5:23 చెప్పు చున్నది. అంతేకాకుండ రక్షణ పొందు చున్న ప్రతివారిని ప్రభువు తన సంఘము తో చేర్చుచుండెను అని అపొ.కా. 2:47 లో వ్రాయబడియున్నది. ఈ వాక్యములను బట్టి రక్షింపబడినవారితో సంఘము సమకూడి యున్నదని మనము గ్రహించు కొనగలము. రక్షింపబడిన వాడెవడును సంఘమునకు వెలుపల యుండుట అసాధ్యము. ఇంకొక మాటలో నీవు సంఘమునకు వెలుపల యున్న యెడల నీవు రక్షింపబడలేదు; నీవురక్షింపబడిన యెడల ప్రభువు సంఘమందు ఉండవలసినది గదా? నోవహు ఓడను నిర్మించినను దానిలోనికి అతడు ప్రవేశించుటకు తిరస్కరించిన యెడల తప్పక నాశనమై యుండునుగదా? అట్లే క్రీస్తునిర్మించిన సంఘములో నీవు ప్రవేశించనియెడల నోవహు నిర్మించిన ఓడకు వెలుపల యున్నవారివలె నీవు నశించిపో గలవని గ్రహించుకొనుము.

నోవహు ఓడను నిర్మించెను.

అతడు ఒకేఒక్క ఓడను నిర్మించెను. క్రీస్తు తన సంఘమును కట్టుదునని మత్తయి 16:18లో వాగ్దానము చేసెను. ఆయన తన సంఘమును కట్టెను. ఆయన ఒకేఒక్క సంఘమును కట్టెను (ఎఫెసీ 4:4). నోవహు కట్టిన ఓడలో ఒకేఒక్క కుటుంబము రక్షింపబడెను. క్రీస్తు సంఘములో కూడ ఒకేఒక్క కుటుంబ మున్నది. అది దేవుని కుటుంబము, నోవహుయొక్క కుటుంబమంతయు ఓడలో యుండెను. దేవుని కుటుంబ మంతయు సంఘములో యున్నది. నోవహు పిల్లలు. ఓడలో ఎట్లుండిరో అట్లే దేవుని పిల్లలు మాత్రమే సంఘములో యుందురు. ఓడలో యున్న వారందరు నోవహు పిల్లలు ఓడలో యున్నవారందరు నోవహు పేరును ఎట్లు ధరించిరో, సంఘములో యున్నవారందరు క్రీస్తు పేరును అట్లే ధరింతురు. ఓడకు వెలుపల యుండి పోయినవారు ఎట్లు అవిధేయులై యుండిరో, సంఘమునకు వెలుపల నున్నవారు కూడ అట్లే అవిధేయులే యుందురు. ఓడలోని వారందరు రక్షింపబడిరి. సంఘములోయున్న వారందరు రక్షింపబడినవారు. ఓడకు

వెలుపలయున్న వారు నశింతురు. ఓడలో ప్రవేశించుటకు కూడ ఒకేఒక్క మార్గమున్నది. ఆమార్గమే యేసుక్రీస్తు. అందుకే "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని యేసుచెప్పెను (యోహాను 14:6).

క్రీస్తు అనుగ్రహించు రక్షణను నీవును ఈ దినమందు పొందవచ్చును. నోవహు దేవుని మాటను విని విశ్వసించి లోబడెను. నీవు క్రీస్తునుగూర్చిన సువార్తను విని, విశ్వసించి, నీపాపముల విషయమై మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు క్రీస్తునిర్మించిన ఆత్మీయ ఓడయగు సంఘములోనికి ఆయన నిన్ను చేర్చును.

## ప్రభువు చేయు శిక్ష
## ( The Chastisement of God)

పరమందొక దేవుడున్నారు! అట్లయితే నీతిమంతులు ఎందుకు శ్రమనొందుచున్నారు ? అనీతిమంతులు ఎందుకు భాగ్యవంతులగుచున్నారు? అనేకులు ఈప్రశ్ననడుగుదురు. దేవుడు జీవిస్తు మానవనడవడిని కంట్రోలు చేయుచున్నట్లయితే నీతిమంతులకు ఎల్లవేళలా మేలు జరగాలి, దుష్టులు శిక్షించబడాలని వారు తలస్తారు.

ఎవడును నశింపవలెనని దేవుని కిష్టములేదు :

దేవుడు ప్రేమించే దేవుడని మనం జ్ఞాపకముంచుకోవాలి. అందరికీ మేలు జరగాలనే ఆయన కాంక్షింస్తారు. ఆయన ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందాలని కోరుచు దీర్ఘశాంతము గల దేవుడై యున్నారు (2 పేతురు 3:9). అందువలన దేవుడు దుష్టుల యెడల సయితము తన ప్రేమను వెల్లడిపరచుచున్నారు. "ఆయన చెడ్డవారి మీదను మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు" (మత్తయి 5:45).

మనుష్యుని శ్రద్ధ అంతటినీ దేవుడు దీవించును :

దుష్టులు ప్రకృతి సూత్రములకు లోబడి, నాటుటకు, పని చేయుటకు, కోత కోయుటకు శ్రద్ధకలిగిన వారైతే వారు సమృద్ధియైన పంటనుకోయుదురు. తమ వ్యాపారమునందు శ్రద్ధకలిగిన వారైతే, యదార్ధత, కృషి యొక్క ఫలితము వలన వారు లాభప్రాప్తి పొందుదురు. "వెలుగు సంబంధులకంటె ఈలోక సంబంధులు

తమ తరమును బట్టి చూడగా యుక్తి పరులై యున్నారని" యేసుప్రభువు చెప్పారు (లూకా 16:8). నీతిమంతులైన వారు లోకస్థులవలెకష్టపడి పనిచేయ కుండా, శ్రద్ధలేకుండా యుంటే లోకస్థులే సంపన్నుల గుటలో ఆశ్చర్యపడనక్కర లేదు. దేవుడు ఆకాశమునుండి వర్షమును ఫలవంతములైన రుతువులను దయ చేయుచు ఆహారమునను[గ్రహించుచు అందరి హృదయములను ఉల్లాసముతో నింపుచున్నారని అపొ.కా 14:17 చెప్పు చున్నది.

**అందరి లెక్కలు ఆయన ఇక్కడే చూడరు:**

ఈలోకంలో భక్తిపరుల కంటే దుష్టులే సంపన్నపరులుగా యుంటే, మరొక లోకం వున్నదని మనం గుర్తుంచు కోవాలి. ర్గాబోవు లోకంలో పరిపూర్ణతలేని ఈలోకపు అన్యాయములన్నీ రైటు చేయ బడ్తాయి. అందువలన నీతిమంతులు ఈలోకంలో పరిపూర్ణతను కాంక్షించ కూడదు. గాని పరలోకంలో పరిపూర్ణ తయుండును అగ్నిజ్వాలలలో యాతన పడుచున్న ధనవంతునితో దేవుడు, "కుమారుడా, నీ జీవితకాల మంతయు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి. ఆలాగుననే లాజరు కష్టము అనుభవించె నని జ్ఞాపకము చేసికొనుము. ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతనపడుచున్నావు" అని చెప్పెను (లూకా 16:25).

దుర్మార్గుడొకడు నీతిమంతునితో ఇట్లన్నాడు : "దేవుడున్నాడనినీవంటావు. నేను దానినినమ్మను. నాభార్యపిల్లలు ఆరోగ్యంగా యున్నారు. నాపశువులు బలిసియున్నవి. మంచిపాడినిచ్చుచున్నవి. నాకోత విస్తారముగా యున్నది. నీభార్య పోయిన సంవత్సరము చనిపోయింది, నీపిల్లలు నీరసముగా యున్నారు. నీ పశు వులకు రోగము సోకినది, నీకోత కొంచెముగానే యున్నది. గనుక దేవుడు లేడని ఇది రుజువు చేయుచున్నది. ఆయన వుంటే నీవు అభివృద్ధిజెందాలి, నేను క్షీణించాలి. అందుకా నీతిమంతుడు "లెక్కలన్నీ దేవుడు ఇక్కడేచేసేయడు" అని జవాబిచ్చాడు.

**శిక్ష దేవుని ప్రేమకు సూచన :**

దేవుడు తన కాపుదలననుసరించి ప్రత్యేకమైన శిక్షలకు మనలను గురి చేయునని నీతిమంతులు జ్ఞాపకముంచు కోవాలి. కొందరు దీనిని అర్థము చేసి కోలేనందున దేవదూషణ చేస్తారు, పొరబడ్తారు. విరక్తులగుతారు. గాని బైబిలు ఇట్లు చెప్పుచున్నది. "నాకుమారుడా, ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము. ఆయన నిన్నుగద్దించి నప్పుడు విసుగకుము. ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షించి తాను స్వీకరిం చు ప్రతికుమారుని దండించును. శిక్షా

ఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మునుచూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమాళ్లయిన వారందరు శిక్షలో పాలుపొందుచున్నారు. మీరు పొందని యెడల దుర్బీజులే గాని కుమారులు కారు" (హెబ్రీ 12:6-8). ఈలేఖనమునుండి మనం అనేక సంగతలు నేర్చుకోగలము. మొట్ట మొదటిగా, మనం శిక్షింపబడక పోతే దేవుడుమనలను కుమారులుగా కాదుగాని దుర్బీజులుగా ఎంచుచున్నారు. గనుక క్రైస్తవుడు శిక్ష అనుభవించినప్పుడు కాదుగాని, శిక్ష అనుభవింపకపోతే ఆందోళన జెందాలి. శిక్ష దేవుని ఆగ్రహముకు కాదుగాని అనుగ్రహమునకే గురుతు.

**అన్ని విపత్తులు శిక్షకాదు :**

మనకు కలిగే శోధనలు అర్థరహితమైన విపత్తులని చూడవద్దు, లేదా అవి ప్రకృతి వలన కలిగినవని భావించవద్దు. తుఫానులు, వరదలు, భూకంపములు, రోగములు మొదలైనవి విపత్తులుగా రావచ్చును. వీటినుండి క్రైస్తవుడు మినహాయించబడునని దేవుడు వాగ్దానము చేయలేదు. గనుక కలిగే ప్రతివిపత్తు దేవుని నుండి కలిగే శిక్షయని, ఏదో ఒక రీతిగా దేవుడతనిని శిక్షించుచున్నాడని తలంచ వద్దు. క్రైస్తవులు, క్రైస్తవేత్తరులు కూడ ప్రకృతి విపత్తులుకు లోనగుదురు. అయితే క్రైస్తవునికి కలిగే విపత్తులన్నీ ప్రకృతి వలన కలిగేవి కావు. హెబ్రీ 12:6-8 ప్రకారము దేవుడు తన కాపుదలనను సరించి క్రైస్తవునికి ప్రత్యేక శిక్షనను గ్రహించును. పాపము చేయుటకై కలుగు శోధనలన్నీ అపవాది నుండియే కలుగునని కూడ బైబిలు బోధించుచున్నది. కొన్ని విపత్తులు అపవాది వలన కలుగును. దేవుడు మనలను శిక్షించునపుడు లేదా అట్లు చేయుటకు అపవాదికి అనుమతి నిచ్చినప్పుడు దానిని తృణీకరించ వద్దని హెచ్చరింపబడి యున్నాము. విపత్తులు సంభవించినప్పుడు మనం తిరుగుబాటు తనము, నిరుత్సాహము, సంశయములకు తావీయకుడదు. అవి అన్యాయము, అక్రమము అని తలంచ కూడదు. మనము విసుగ కూడదని కూడ హెచ్చరింపబడి యున్నాము.

**శ్రమలలో క్రైస్తవులు మహిమపరచుదురు:**

గడ్డుకాలమును దేవుడునాకు పంపించియున్నారు గనుక ఆయనను గుర్తించి నేనాయనకు లోబడి యేయుందునని తలంచితే అది అంగీకారయోగ్యమైనది. "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను " (హెబ్రీ 5:8). శిక్ష దేవుని ప్రేమకు సూచనయై యున్నది. "ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షించును" (హెబ్రీ 12:6). అందు వలన మనం

శ్రమల యందు ఓర్పుగలవారైయుండాలి (రోమా 12:12). అవును, మనం ఇంకా ఎక్కువ చేయ గలగాలి. మనం శ్రమల యందు అతిశయపడాలి (రోమా 5:3). క్రీస్తు యొక్క శ్రమలలో పాలివాడగుటకు పౌలుకాంక్షించాడు (ఫిలిప్పీ 3:10). "మీరునానావిధములైన శోధనలలో పడునప్పుడు అది మహానంద మని ఎంచు కొనుడి" యని యాకోబు వ్రాసాడు (యాకోబు 1:2). మనము ఆయన నామము నిమిత్తము నిందించబడి హింసిం పబడునప్పుడు సంతోషించి ఆనందించా లని యేసు ప్రభువు చెప్పారు.

శిక్షించడానికి ప్రత్యేక కారణము లుండ వచ్చును, లేని యెడల దేవుడు దానిని కలుగనీయరు. మనమేలు కొరకే ఆయన శిక్షించుచున్నాడని హెబ్రీ 12:10 చెప్పుచున్నది. శిక్షలో మనకు కలిగే ఈ మేలు యేమిటి ?

**శిక్షలలో పెరుగుదల సాధ్యమగును :**

"ప్రస్తుత మందు సమస్త శిక్షయు దు:ఖకరముగా కనబడునేగాని సంతోష కరముగా కనబడదు. అయినను దాని యందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చునని "హెబ్రీ12:11 చెప్పుచున్నది. మన మాయన పరిశుద్ధతలో పాలు పొందుటకు గాను ఈలాగు జరుగునని హెబ్రీ 12:10 చెప్పుచ్నుది.

అది ఈలాగుపనిచేయును. ఒకడు క్రైస్తవుడైనప్పుడు అతడు పాపము నుండి విడుదలచేయబడును, పవిత్రుడ గును గానిఅనుభవము లేనివాడగును. అతడు నీతియందు శిక్షణపొందియుండ లేదు, "అతడు నీతివాక్య విషయములో అనుభవములేని వాడై యున్నాడు" (హెబ్రీ 5:13). అభ్యాసము చేతమేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములను కలిగి యుండునట్లు అతడు ఎదగాలి (హెబ్రీ 5:14). ఈ ఎదుగుదల శిక్షలో సాధ్యమగును. దేవుడు మన నుండి పవిత్రత ఒక్కటి మాత్రమే కోరుటలేదు. పవిత్రత అన్న పుడు అపవిత్రత కూడ యున్నది. నమ్మకము అన్నపుడు అపనమ్మకము కూడ గ్రాహ్యమగును. అందు వలన మనం శోధనలోపడు నప్పుడు దానిని మహానందమని ఎంచుకోవాలి, మనకు కలుగు ఈ విశ్వాస పరీక్షలు పుటము వేయబడే బంగారముకంటే ప్రశస్తమైనవి (1పేతురు 1:7). రక్షింపబడినవారు "మహాశ్రమల నుండి వచ్చిన వారు. గొర్రెపిల్ల రక్తములో తమ వస్త్రములు ఉదుకుకొని వాటిని తెలుపు చేసికొన్న వారు " (ప్రకట 7:14). పరలోక మందుండు దేవుని ప్రజలు యుద్ధములు చేసి విజేయులైన వారు. "శోధన సహించు వాడు ధన్యుడు. అతడు

శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును" అని యాకోబు 1:12 చెప్పుచున్నది. అందు వలన "మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి ... మీరు సంపూర్ణులును అనూనాంగులును ఏవిషయములోను కొదువ లేని వారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి" (యాకోబు 1:2-4). "ఫలించు ప్రతితీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును " అని యోహాను 15:2లో యేసు చెప్పారు. క్రైస్తవులు శ్రమలలో ఓర్పుకలిగియుందురు గనుక శ్రమలు సంభవించున పుడు మనము సొమ్మసిల్లిపోము, అన్యాయమని సణుగుకొనము, లేదా పాపము యొక్క సూచనయని గాని తలంచము. శ్రమలు దేవుని ప్రేమకు సూచనలు. వాటిద్వారా మనకు మేలు కలుగును, మనం పరీక్షింపబడి పవిత్రులుగా చేయ బడుదుము. అందువలన శ్రమలలో మనం ఓర్పుకలిగి యుండాలి, అవి ప్రశస్తమైనవి. వాటి ద్వారా మనం దీవించ బడ్డాము. క్రీస్తుయేసు యొక్క శ్రమలలో పాలివారమవుచున్నందుకు దేవునికి కృతజ్ఞత చెల్లించాలి. నీతి, సమాధానమను ఫలములు ఫలించాలి. వాడబారని జీవ కిరీటము కొరకు ఎదురు చూడాలి.

\- ఓటిస్ గేడ్వుడ్

## విత్తువాడు
## (The Sower)

**మత్తయి 13:1-23; మార్కు 4:1-20; లూకా 8:4-15**

**పరిచయము** :

అత్యంత ఘనుడైన బోధకుడగు యేసు అలంకార రీతిగా తరుచు బోధించెను. యేసు చెప్పిన అలంకార ఉదాహరణలన్నీ ఉపమానములేయని కొందరు చెప్పుదురు (ఉదా: మత్తయి 5:13-16). అయితే మత్తయి 13వ అధ్యాయము నుండి యేసు ఉపమానము లను పరిపూర్ణరీతిగా వినియోగించెను. యేసు తన బోధన విధానమును మార్చి బోధించుచున్నట్లు శిష్యులు గ్రహించి "నీవు ఉపమాన రీతిగా ఎందుకు మాట లాడుచున్నావని" వారాయనను ప్రశ్నించారు (మత్తయి 13:10).

యేసు ప్రభువు చెప్పిన ఉపమానములు అత్యంత ప్రయోజన కరములు. యేసు తన ఉపమానములోని ప్రతి అంశమును శిల్పకారుని చెక్కడము వలె చెక్కారు. ఆయన ఉపమానములు సంక్షిప్తమైనవి, సూక్ష్మమైనవి. జనులెరిగిన వ్యవసాయము, గృహజీవితము, వ్యాపా

రము, సాంఘికజీవనము, ప్రకృతి మొదలగు అంశములను ఆయన ఉపమానములలో వినియోగించెను. పరసంబంధ సంగతులను బోధించుటకు ఇహసంబంధసంగతులు ఉపమానములలో వినియోగించెను. పరసంబంధ సంగతులను బోధించుటకు ఇహసంబంధసంగతులు ఉపమానములో వాడబడెను.

'విత్తువాని గూర్చిన ఉపమానము' అను నామకరణమును ప్రభువే దానికి యిచ్చారు (మత్తయి 13:18). ఆయనే దానికి భావార్థము చెప్పెను. యేసు గురుగులను గూర్చిన ఉపమానము యొక్క భావార్థము కూడ చెప్పారు (మత్తయి 13:24-30, 36-43). గనుక మిగతా ఉపమానములను అర్థము చేసికొనుటకు ఈ రెండింటి భావార్థమును మనము సంపూర్తిగ గ్రహించు కొనుట అత్యవసరము. విత్తువాని ఉపమానము, గురుగులను గూర్చిన ఉపమానము యొక్క గ్రహింపు మిగతా ఉపమానములను గ్రహించుటకు మూలమగును.

ఆయన ఎందుకు ఉపమానరీతిగా బోధించారో కూడ యేసు తెలియజేసారు (మత్తయి 13:10-17). యూదుల చరిత్ర అంతటిలోను తరుచు వారిని గూర్చి వాడబడిన పదములను యేసు ఇక్కడ వినియోగించారు (ద్వితీ 29:4; యెషయా 6:9-10; యెహెజ్కేలు 12:2). పౌలు కూడ తాను బోధించుచున్న వారు దేవునివాక్యము విషయమై వాతవేయబడినట్లున్నారని చిత్రీకరించాడు (రోమా 11:8).

"ఇందునిమిత్తమై నేను ఉపమానరీతిగా వారికి బోధించుచున్నాను. ఈ ప్రజలు కన్నులార చూచి, చెవులారవిని హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారు తమ కన్నులు మూసికొని యున్నారు గనుక మీరు వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు. చూచుట మట్టుకు చూతురు గాని యెంత మాత్రమును తెలిసికొనరు అని యెషయా చెప్పిన ప్రవచనము వీరి విషయమై నెరవేరుచున్నది. అయితే మీకన్నులు చూచుచున్నవి గనుక అవి ధన్యములైనవి. మీచెవులు వినుచున్నవి గనుక అవి ధన్యములైనవి" (మత్తయి 13:13-16).

రాజ్యమును గూర్చి యేసు చెప్పిన డజను ఉపమానములలో విత్తువాని ఉపమానము ఒకటియై యున్నది. ఆత్మీయ రాజ్యమును గూర్చిన భావము పాతనిబంధనలో ఉత్పన్నమాయెను. అది ప్రవచనములలోను, సిద్ధపాటులోను, నెరవేర్పులోను ముఖ్య భాగమాయెను. "ఆరాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక

రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు" (దానియే 2:44). యేసు ప్రభువు, బాప్తిస్మమిచ్చు యెహాను, వారి యొక్క శిష్యులు ఫిలిప్పు, పౌలు, యోహాను మొదలగువారు రాజ్యమును గూర్చి బోధించిరి (మార్కు 1:15, 3:1-2, అపొ.కా. 8:12; కొలస్స 1:13; ప్రక 1:9). ఇవియేగాక మిగతా లేఖన భాగములు కూడ రాజ్యమును గూర్చి బోధించును. లేఖనములలో అది తరుచు పరలోక రాజ్యమని, దేవుని రాజ్యమని సంబోధించుట జరిగినది, ఈ రెండు పదములు సరిసమానముగ ఒకే రాజ్యమును సూచించుటకు వాడబడినవి.

ఈ ఉపమానములో ప్రభువు రాజ్యము ఒక మొక్కతో పోల్చబడెను క్రమక్రమముగా, కనబడు పెదుగుదల ఇందులోకనబడును. అంటే ఒక మొక్క పెరగాలన్నా, రాజ్యము అభివృద్ధి కావాలన్నా ఓర్పు అవుసరము (యాకోబు 5:7; లూకా 8:15).

క్రైస్తవ పెరుగుదలలో చెట్టుకంటే ముందు ఫలమును కాంక్షించ కూడదు. రాజ్యము యొక్క క్రమము అభివృద్ధి వ్యక్తులు మార్పుజెందుట, తదుపరి వారి ఆత్మీయాభివృద్ధి పై ఆధారపడియున్నది. క్రీస్తులో శిశువులైన వారు క్రమముగా దేవుని వాక్యమనే పాలను ఆపేక్షించాలి (1పేతురు 2:2-3). అప్పుడు వారు బలవంతులగుదురు. క్రైస్తవులు (రాజ్యము కూడా) బలవంతులు కాకపోతే వారి అభివృద్ధి కుంటుపడును (1కొరింథీ 3:1-4; హెబ్రీ 5:11-6:2). క్రైస్తవుల యొక్కయు రాజ్యము యొక్కయు అభివృద్ధి క్రమక్రమముగా యుండాలి, అభివృద్ధి జెందాలి.

నిజానికి విత్తువాడైన ప్రతిక్రైస్తవుడు విత్తనము ఎట్లు పెరుగునో తెలిసికొన నవుసరము లేదు. అయితే విత్తువాడు మాత్రము నిష్కల్మషమైన విత్తనమును ఎంచుకోవాలి, ఏలయనగా "విత్తనము దేవుని వాక్యము" (లూకా 8:11). విత్తువాడు చేయవలసినదంతా విత్తడమే. ఆవిత్తనము మొలకెత్తునట్లు చేయుశక్తి అతనికి లేదు.

వ్యవసాయములోను రాజ్యవిస్తరణ లోను అభివృద్ధి జెందాలంటే మానవుడు దేవుడు కూడ జత కట్టబడియుండాలి. దేవుడు లేకుండా మానవుడు రాజ్యమును విస్తరింపజేయంజాలడు, మరియు మానవుని యొక్క విధేయతతో కూడిన సహకారములేకుండా దేవుడు రాజ్యమును విస్తరింపజేయడు. అందు వలననే, "నేనునాటితిని అపొల్లో నీరుపోసెను, వృద్ధి కలుగుజేసిన వాడు దేవుడే" యని పౌలు చెప్పెను (1కొరింథీ 3:6). మంచి పంట కావాలంటే దైవ మానవ సహకారము అత్యవుసరము.

విత్తువాని ఉపమానము యొక్క ముఖ్యోద్దేశము మాత్రమేగాక, తమ పరిచర్యలో కలుగు కొన్ని పరిణామములను గూర్చి శిష్యులను సిద్ధపరచు నిమిత్తము యేసు ఈ ఉపమానము చెప్పియుండ వచ్చును. చివరిగా అపొస్తలులు తమ బోధకుడు సిలువపై మరణించుటచూచారు. దానికి ముందు వెనుక కూడ వారు ప్రకటించిన సువార్తకు ప్రతిఘటనను వారు ఎదుర్కొన్నారు. యేసుతన శిష్యులకు పరిమితిగల ఆజ్ఞ యిచ్చి పంపకముందు వారు ప్రతి ఘటనను హింసను ఎదుర్కొందురని ముందుగనే వారికి తెలియజేసెను (మత్తయి 10:16-25).

అపొ.పౌలు సువార్తప్రకటించుచుండగా అది ఎట్లు నిరాకరించబడెనో అపొస్తులలకార్యముల గ్రంధములో వ్రాయబడి యున్నది. పౌలు యొక్క శ్రమలు 2 కొరింథీ 11:23-28లో మనకు కనబడును. ముఖ్యముగా ఏథెన్సులో అతడు సువార్తప్రకటింపగా అతనికి కలిగిన విజయము బహుస్వల్పమే (అపొ.కా. 17).

శాతము కట్టవలసివస్తే విత్తువాని ఉపమానము సువార్తచాటు కృషిలో నూటికి 25వ వంతు మాత్రమే మంచి ఫలితము లభించునని సూచించుచున్నది. రక్షింపబడువారు కొందరే (మత్తయి 7:13-14). అయినను సరే లెక్కింపజాలనంతమంది జనులు పరలోకములో యుందురు (ప్రకటన 7:9). ఒక సందర్భములో అపొస్తలులు యేసును వెంబడించినందు వలన యేమి దొరుకును అనే నిరుత్సాహమును వ్యక్తపరచిరి. గాని వారు కోల్పోయిన దానికంటె అత్యధికముగా దేవుడు వారికి దయ చేయునని యేసు వారికి నిర్ధారణనిచ్చారు (మత్తయి 19:27-30).

అపొస్తలులు, ఆదిమ క్రైస్తవులు కూడ నిరుత్సాహపడుటకొక కారణమున్నది. వారు హింసలు పాలయ్యారు (అపొ.కా. 8:1-4). నేడుకూడ మనం ఎవరికైనా యేసును గూర్చి చెబితే వారు నిరాకరిస్తే మనకు బాధకలుగును. గాని మనం అపొస్తుల లవలె సంతోషించడానికి గొప్ప కారణమున్నది. మనం విమోచింపబడిన వారము మరియు సువార్త అనేకులకు చాటబడుచున్నను రక్షింపబడే వారు కొద్దిమందియే.

**ఉపమాన సందర్భము :**

కపెర్నహూమునకు వెలుపల గొప్ప జనసమూహమునకు యేసు ఈ ఉపమానము చెప్పెను. గలిలయ సముద్రము దరినున్న ఒక నావలో కూర్చుని యేసు జనసమూహములకు ఉపదేశించెను (మత్తయి 13:1-2).

ఆరోజు అంతకు ముందు

దయ్యము పట్టిన ఒక మనుష్యుని ఆయన బాగుచేసెను (మత్తయి 12:22); అది అనేకులలో ఆసక్తిని మరికొంతమందికి వివాదమును రేకెత్తించెను. పరిసయ్యులు యేసు నుండి ఒక సూచక క్రియ చూడగోరారు గాని యేసు వారిని నిరాకరించెను (మత్తయి 12:38-45). యేసు కుటుంబసభ్యులు ఆయనను చూచుటకు వచ్చిరి గాని జనసమూహము వలనవారాయనను కలిసికొన లేకపోయిరి (మత్తయి 12:46-50). ఆ దినమందే యేసు ఉపమానరీతిగా బోధింపనారంభించెను. విత్తువాని ఉపమానము అందులో ఒకటి.

**ఉపమానము :**

"ఆయన జనసమూహములను చూచి చాల సంగతులు ఉపమానరీతిగా చెప్పెను, ఎట్లనగా ఇదిగో విత్తువాడు విత్తుటకు బయలు వెళ్లెను" (మత్త 13:3).

యేసు ముందున్న జనములు విత్తనములు బాగుగా ఎరిగినవారే విత్తనము ఎవరైనా విత్తవచ్చును. చిన్న పిల్లలు సయితము భూమిలో విత్తనము నాటగలరు. అదేరీతిగా క్రైస్తవులందరు రాజ్యము యొక్క విత్తనము విత్తగలరు (అపో.కా. 8:4; 2తిమో 2:24; హెబ్రీ 5:11-6:2).

కానాను వాసులు సాధారణముగా గ్రామములలోనే నివసించేవారు. వారందరు విత్తనములు విత్తేదృశ్యాన్ని చూచిన వారే. "విత్తువాడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవప్రక్కనుపడెను; పక్షులు వచ్చి వాటిని మ్రింగివేసెను" (మత్తయి 13:4).

విత్తబడిన విత్తనము మంచిదేయను భావము ఈ ఉపమానములో యున్నది. ప్రతి చోట పడినది మంచి విత్తనమే. విత్తనము నాటబడితేనే గాని పంటరాదని మనందరము ఎరిగిన వాస్తవమే. విత్తబడిన దానిని బట్టి వచ్చే పంటను కూడ అంచనా వేయగలము. ప్రతి విత్తనము దాని జాతి ప్రకారము ఫలము నిచ్చును (గలతీ 6:7-8, ఆది.కా. 1:11) విత్తబడిన విత్తనము యొక్క నివృత్తిలోనే వంట కూడ యుండును (2కొరింధీ 9:6),

ఈ ఉపమానములో విత్తనము దేవుని వాక్యము (మత్త 13:19; మార్కు 4:14; లూకా 8:5,11). ఈ విత్తనము సజీవమైనది, అక్షయమైనది, నిత్యమైనది, "మీరుక్షయ బీజమునుండి గాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా అక్షయబీజము నుండి పుట్టింపబడినవారు" (1పేతురు 1:22-23). పొలములో నాటబడిన విత్తనమువలే దేవుని వాక్యము ఫలభరితమైనది. "వర్షమును హిమమును ఆకాశమునుండి వచ్చి అక్కడికి ఏలాగు మరలక భూమిని తడిపి విత్తువానికి విత్తనమును భుజించు వానికి ఆహారమును

కలుగుటకై అది చిగిర్చునట్లు వర్ధిల్ల జేయునో ఆలాగే నానోటనుండి వచ్చు వచనమును ఉండును. నిష్ఫలముగా నా యొద్దకు మరలక అదినాకు అనుకూల మైన దానిని నెరవేర్చును. నేను పంపిన కార్యమును సఫలము చేయును'' (యెషయా 55:10-11).

ఆత్మీయం విత్తనమైన దేవుని వాక్యము మన ఆత్మలను రక్షించును (యాకోబు 1:21) మంచి మనస్సుగల వారి ఆత్మకు యేసు యొక్క మాటలు జీవము కలుగజేయును (యోహాను 6:63). అట్లు గాక మరణము కలుగ జేయు విత్తనము నాటుటకు ఒకడు ఎంచుకొనవచ్చును (గలతీ 6:7-8). ఫలించకపోతే నాశనము సంభవించును (యోహాను 15:2,6).

త్రోవపక్కను పడిన విత్తనమును గూర్చి ఈ ఉపమానములో మొదట చెప్పబడినది. ఇది విత్తువాని ఉపమానమని చెప్పబడినను విత్తువాడు ఇందులో ముఖ్యుడు కాదు. వీగి పోయిన పంటను గూర్చి అతడు నింద్యుడుకాదు. పంట యొక్క తారతమ్యములు నేలపై ఆధారపడియున్నవి. బైబిలులో విత్తనము లు పడిన నేల మనుష్యుల హృదయమై యున్నది. అది మనుష్యుని జ్ఞానము (రోమా 10:9-10), భావము (మత్తయి 22:37) చిత్తములై యున్నవి (రోమా 6:16-17). "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీహృదయము ను భద్రముగా కాపాడుకొనుము" (సామె 4:23; మార్కు 7:20-23).

త్రోవగా యున్న నేల గట్టిపడి యుండును. అట్టి నేలపై పడిన విత్తనము ఒక రోడ్డుపై పడిన విత్తనముతో సమానము. అట్టి నేల విత్తనమును బట్టి మార్పుజెందదు. ఆ విత్తనము నిష్ప్రయోజ నముగా నేలపైనే యుండును మొలకెత్తదు. సాతానుకు సాదృశ్యముగా యున్న పక్షులు వచ్చి ఆవిత్తనమును మ్రింగివేయును (మత్త 13:19) గనుక మొలకెత్తదు.

మత్తయి 13 అధ్యా 4, 19 వచనములను బట్టి త్రోవప్రక్కను పోలిన హృదయము గలవాడు వాక్యము ప్రకటిం చబడగా వినినవాడు గాని దానిని మన్నన చేసినవాడు కాదు. అట్టి వాడు తన హృదయమును మూసికొనినవాడు. అందు వలన దానిని గ్రహించుకొనడు; గ్రహించుకొన ప్రయత్నించడు. సువార్త విషయమై అట్టి వాని హృదయము కఠినపరచబడినట్టిది.

హృదయ మార్పుసంభవించక పోతే అట్టివాని ఆత్మరక్షింపబడనేరదు. అసాధ్యముకాకపోయినా, అట్టి హృదయము మెత్తపరచబడ వచ్చును. "నీతి ఫలించునట్లు మీరు విత్తనము

వేయుడి. ప్రేమయను కోత కోయుడి. యెహోవాను వెదకుటకు ఇదే సమయము గనుక ఆయన ప్రత్యక్షమై మీ మీద నీతివర్షము కురిపించునట్లు ఇదివరకెన్న డును దున్నని బీడుభూమి దున్నుడి" (హోషేయ 10:12).

"కొన్ని చాలమన్నులేని రాతి నేలను పడెను; అక్కడ మన్నులోతుగా ఉండనందు న అవి వెంటనే మొలిచెను గాని సూర్యుడు ఉదయించినప్పుడు అవి మాడి వేరులే నందున ఎండిపోయెను" (మత్తయి 13:5-6). "రాతి నేలను విత్తబడినవాడు వాక్యము విని సంతోషముతో దాని నంగీకరించువాడు. అయితే అతనిలో వేరు లేనందున అతడు కొంతకాలము నిలుచునుగాని, వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలుగగానే అభ్యంతరపడును" (మత్త 13:20-21).

రాతినేలపైనున్న పలుచటి మంటి పొర ఇక్కడ ఉదహరించబడినది. అది విత్తనము ఫలించుటకు సరిపడినంత మన్నులేనిది. ఇక్కడ పడిన విత్తనము మొలకెత్తును గాని మన్నులోతుగా లేనందున సూర్యుని వేడిమికి ఎండిపోవును వేరులోతుగా యున్న మొక్క అయితే నిలబడును.

ఈరకమైననేలను పోలిన హృద యముగలవాడు సంతోషముతో దేవుని వాక్యమునంగీకరిస్తాడు గాని త్వరలోనే అభ్యంతరపడి వెనుదిరుగును. శ్రమ యైనను, హింసయైనను కలుగగానే విశ్వాసభ్రష్టుడగును. రాతినేలను పోలిన వాడు సువార్తకు వెంటనే స్పందించును గాని విశ్వాసములో నాటబడిన వాడు కాడు. అతడు శిష్యత్వమూల్యమును గూర్చి ఆలోచించినవాడు కాదు (లూకా 14:27-33). అతని ఆసక్తి కుంటు బడినందున హింసకలుగ గానే, బలము పొందుటకు బదులు బలహీనుడగును (యాకోబు 1:2-4). క్రైస్తవుడగుట సులువేగాని, క్రైస్తవ్యమును పాటించుట కష్టము.

లోతుగా నాటబడితేనే గాని ఏ మొక్కయు బ్రదుకదు. ఒకడు క్రీస్తులో లోతుగా నాటబడాలి (కొలస్స 2:7; ఎఫెసీ 3:17).

"కొన్ని ముండ్లపొదలలోపడెను; ముండ్లపొదలు ఎదిగి వాటిని అణచి వేసెను" (మత్తయి 13:7).

"ముండ్లపొదలలో విత్తబడిన వాడు వాక్యము వినువాడే గాని ఐహిక విచారమును ధనమోసమును ఆవాక్య మును అణచివేయును గనుక వాడు నిష్ఫలుడగును" (మత్తయి 13:22).

ముండ్లపొదలనడుమ పడిన విత్తనము, ముండ్ల పొదలతో కూడ పెరుగును. ముండ్ల పొదల విత్తనము, అప్పటికే భూమిలో యున్నందున

మంచి విత్తనముతో కూడ పెరుగును. అవిపడిన నేలసారవంతమైనదే. గాని మంచి విత్తనము మొలకెత్తగా ముండ్ల పొదలతో పోటీ పడవలసివచ్చెను. ముండ్ల పొదలు మంచి మొక్కను అణగద్రొక్కెను. అందు వలన కొంత కాలమునకు అదియు నిష్ఫలమాయెను.

ముండ్ల పొదలనడుమ విత్తబడిన హృదయముగలవాడు సువార్తవాక్యము నంగీకరించును, గాని ఈలోక విచారము, ధన సంపాదన అనువాటితో నాటబడిన వాక్యమును అణచివేయును. మన జీవితంలో నుండి యేసును బయటకు పంపించే దేదయినా ముండ్ల పొదవంటిదే. అది సుఖము, భోగము, ధనము, పలుకుబడి, విద్య, ఆస్థి, వినోదము, ఆటపాటలు మొదల గునవికావచ్చును. అదుపులో పెట్టబడని ఏ అలవాటైనను క్రీస్తుకు ఆటంకముగా మారును. ముండ్ల పొదలను పోలిన హృదయముగలవారు నులి వెచ్చని క్రైస్తవులు (ప్రకట 3:15-16). వారు తమ మొదటి ప్రేమను విడిచిపెట్టినవారు (ప్రకట 3:2). వారు నిత్యత్వాన్ని నిర్లక్ష్యము చేయుదురు. తదుపరి జీవితంకొరకు సిద్ధపడరు. సుఖ భోగముల కొరకు ధనార్జన కొరకు సమయ మును వెచ్చింతురు (హెబ్రీ 11:24-25). మానవుడు దేవునికి సిరికిని దాసుడుగా యుండనేరడు (మత్తయి 6:24). క్రైస్తవులు తమకేవి ముఖ్యమో వాటిని [illegible] క్రమములో ఎంచుకోవాలి (మత్తయి 6:33).

"అందుకాయన నీపూర్ణహృదయ ముతోను నీపూర్ణాత్మతోను నీపూర్ణమనస్సు తోను నీదేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను" (మత్తయి 22: 37-40).

ముండ్లపొదల వంటిహృదయము విశ్వాసభ్రష్టత్వము సంభవించే అవకాశ మున్నదని తెలియజేయుచున్నది. దేవుని బిడ్డయైనవాడు పాపముచేసి నాశన మగుట సాధ్యమేయని బైబిలు బోధించు చున్నది. దీనిని బోధించు అనేక లేఖనము లున్నవి (2 పేతురు 2:20-22).

"కొన్ని మంచి నేలను పడి ఒకటి నూరంతలుగాను ఒకటి అరువదంతులు గాను ఒకటి ముప్పదంతులుగాను ఫలించెను (మత్త 13:8). "మంచి నేలను విత్తబడినవాడు వాక్యమును విని గ్రహించు వాడు; అట్టివారు సఫలులై యొకడు నూరంతలుగాను ఒకడు అరువదంతులు గాను ఒకడు ముప్పదంతలుగాను ఫలించును" (మత్త 13:23). మంచి నేల మంచి విత్తనము ఫలించునట్లు చేయును.

కోతకాలము వచ్చువరకు పంట ఎపుగా పెరిగును. మంచినేల, మంచి విత్తనము కలిసి మంచి పంటనిచ్చెను.

మంచినేలవంటి హృదయముగల వాడు వాక్యమును విని దానిని గ్రహించు కొనును (మత్త 13:23), వాక్యమును విని దానిని అంగీకరించును (మార్కు 4:20). మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి, ఓపికతోఫలించును (లూకా 8:15). ఇట్టివారిపై దేవుడు ఆధారపడును. యేసు వారి రక్షణకు కర్తయు, కారకుడును (హెబ్రీ 2 :10, 5:8-9). వారు అజ్ఞానులు గాక, బోధింప సమర్ధులైన వారు (హెబ్రీ 5:11-6:25; 2తిమోతి 2:2,24), మంచి హృదయము గల క్రైస్తవులు విశ్వాస పరీక్షలన్నిటిలో విజయవంతముగా నిలుచువారు (అపో.కా. 8:1-4), లోకమునకు సువార్త చాటువారు (మార్కు 16:15-16). నీతితో భక్తితో జీవించువారు (తీతు 2:12), సంతోషముతో కలిసి ఆరాధించువారు (హెబ్రీ 10:25). తాము విమోచింపబడిన వారమని వారెరుగుదురు (1యోహాను 2:1-3). వీనికొరకు మాత్రమే యేసు మేఘారూఢుడై మరల వచ్చును (1థెస్స 4:13-18, యోహాను 3:29, ప్రక 21:2; 22:17).

"చెవులు గలవాడు వినునుగాక" (మత్త 13:9). ఎవడును నశించనవసరము లేదు. వయస్సు వచ్చిన ప్రతివాడు వినగలడు, గ్రహించుకొనగలడు, అవలంబించగలడు, ఓపికతో ఫలించ గలడు, ప్రతిపురుషుడు, స్త్రీ తన జీవితములో అవుసరమైన మార్పులను చేసికొన వలెను.

**ముగింపు :**

**1.** దేవుని వాక్యము యొక్క శక్తిని సాతాను ఎరుగును. దానిని మననుండి ఎత్తికొనుపోవుటకు ప్రయత్నించును.

**2.** వాక్యమును విత్తుబోధకులు తమ పని కష్టముతో కూడినదని ఎరుగాలి. కొన్ని సార్లు తమ పని నిష్ఫలమైనదనిపించ వచ్చును, వారి కష్టము వ్యర్థమై పోయి నట్లుగుపడును.

**3.** అయితే యాకోబు 3:1 మరియు రోమా 16:17-18 బోధకుల యొక్క బాధ్యతలను గుర్తు చేయుచున్నను, విత్తువాని ఉపమానము వినువాని యొక్క బాధ్యతను కూడ తెలియజేయుచున్నది.

**4.** చిన్న విత్తనమువలె దేవుని వాక్యము శక్తివంతమైనది.

**5.** విత్తనము వలె దేవుని వాక్యము ఫలించును

**6.** విత్తనము వలె దేవుని వాక్యము విత్తబడాలి, నాటబడాలి, నీరు పోయబడాలి, భద్రపరచబడాలి.

**7.** బోధకులు, ఉపదేశకులను నిందించుటకంటే వినువారి మంద చెవులను బట్టి

ఆత్మీయ ఎదుగుదల కుంటుబడును.

8. 1 సమూయేలు 3:10లో చెప్పబడిన స్వభావము మనకుండాలి, "యెహోవా ప్రత్యక్షమై నిలిచి ఆరీతిగా సమూయేలూ, సమూయేలూ అనిపిలువగా, సమూయేలు నీదాసుడు ఆలకించుచున్నాడు, ఆజ్ఞ యిమ్మనెను".

9. ఒకడు వినాలి, యేమి వినుచున్నాడో కూడ ప్రాముఖ్యము, ఎట్లు వినుచున్నామో కూడ ప్రాముఖ్యము.

10. దేవుని వాక్యము ఎల్లవేళలా విత్తబడాలి.

11. దేవుని వాక్యము నిత్యము శక్తి వంతమైనదే.

12. సత్యము ప్రకటింపబడగా దానికి లోబడనివాని హృదయము యోగ్యమైనదికాదు, మంచిది కాదు.

—లూయిస్ రష్మోర్

## క్రీస్తు యేసునందు దీవెనలు

(Blessings in Christ Jesus)

క్రీస్తు యేసునందుండువాడు క్రైస్తవుడు. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింధి 5:17). "క్రీస్తునందున్న యొక మనుష్యునినే నెరుగుదును. అతడు పదునాలుగు సంవత్సరముల క్రిందట మూడవ ఆకాశమునకు కొనిపోబడెను" (2 కొరింధి 12:2).

యేసుక్రీస్తు ద్వారా దేవునితో సరియైన సంబంధము కలిగి యుండిన వారికి మాత్రమే ఆత్మీయ ఆశీర్వాదములు వచ్చును. తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దానిద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధాన పరచవలెనని ఈలాగు చేసెను. గనుక ఆయనయే మనకు సమాధానకారకుడై యున్నాడు (ఎఫెసి 2:16). క్రీస్తు ప్రభువునందున్న వారు అనుభవించ గలిగే కొన్ని దీవెనలు.

**క్రీస్తునందు క్షమించబడుట అనే దీవెన**

"పేతురు మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అ.కా. 2:38). "ఆయన వెలుగులో యున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను

1:7). యేసు రక్తము ప్రతి ఒక్కరిని పవిత్రులనుగా చేయును. పవిత్రులుగ నిలువబెట్టును. వెలుగులో నడచుటకు తోడ్పడును.

**క్రీస్తు యేసునందు సమాధానమనే దీవెన :**

క్రీస్తు నందుండక వేరుండువాడు దేవునికి విరోధి. "వ్యభిచారిణులారా, ఈలోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈలోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4). అనవసర ప్రదేశములన్నిటి యందును సమాధానము కొరకు ప్రపంచముచూచుచున్నది. అయితే నిజమైన సమాధానము క్రీస్తునందు మాత్రమే గలదు. యేసు ప్రభువు ద్వారానే దేవునితో సమాధానము పొందగలము. కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము (రోమా 5:1).

**క్రీస్తునందు సిద్ధపాటు యొక్క ఆశీర్వాదము**

ఎవరు సిద్ధపడి యుందురో అట్టి వారికి మాత్రమే నిత్యము నిలుచునట్టి ఆనందము కలుగును. "నేనిప్పుడే పానార్పణముగ పోయబడుచున్నాను. నేను వెడలిపోవు కాలము సమీపమైయున్నది. మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నాకొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించువారి కందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:6-8). క్రీస్తు యేసునందుండిన ప్రతి వ్యక్తికి మరణము కొరకైన సిద్ధపాటు ఒక దీవెనకరముగ యుండును.

క్రీస్తుయేసునందుండని వ్యక్తికి మరణముకొరకైన సిద్ధపాటు గాని, లేక నిత్యజీవమును గూర్చిన వాగ్దానముగాని లేక తన శ్రమలను తానే భరించుకొనవలెను. క్రీస్తునందుండునట్లు సువార్త వినవలెను. "వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తునుగూర్చిన మాటవలన కలుగును'' (రోమా 10:17). "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియబరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనేగాని, నేను యే ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనిన యెడల, ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు" (1కొరింథి 15:1-2). రక్షణ పొందునట్లు మారుమనస్సు పొందవలెను; అనగా పాపక్షమాపణ

నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నాతండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును (మత్తయి 10:32, రోమా 10:9-10). క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? (రోమా 6:3, గలతి 3:27). క్రీస్తునందు విశ్వాసము గల ప్రతి వ్యక్తి మరణము కొరకైన సిద్ధపాటును నిత్యజీవము కొరకైన వాగ్దానమును, శ్రమలయందు ఆదరణ, సహాయము, నిరీక్షణ కలిగి యుండును.

ఆత్మీయంగా నీవు యెచ్చట ఉన్నావు? క్రీస్తునందుంటివా? క్రీస్తుయేసునందున్న వారు సంఘమనే ఆయన శరీరములో యున్నారని క్రొత్త నిబంధన బోధించుచున్నది. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు, క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయలలో వెలుగుచుండనియ్యుడి. ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలుబడితిరి (కొలస్సీ 1:18,3:15).

– చార్ల్స్ బాక్స్.

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

**గమనిక : ఈ నెల నుండి యేసు యొక్క ఉపమానముల శీరిక్ష వరుసగా ప్రచురింపబడుచున్నది. గనుక సత్యవాక్కును క్రమముగా చదువండి చదివించండి, –ఎడిటర్**

**క్రీస్తుసంఘమనగా నేమి?** అను అంశమును సోదరులు ధ్యానించిరి. కె.డేవిడ్ రంజ్(ప్రీధిగాగిలంక). యమ్.జాన్‌బాబు(నడిపూడి),రాజేంద్రకుమార్ (తాడేపల్లిగూడెం)గార్లును, జాషువాగూటం గారును.తదితరులును వాక్యోపదేశము గావించిరి.ఇద్దరు స్థానికులు బాప్తిస్మము పొందిరి.వచ్చినవారందరికి మంచి విందు భోజనము ఏర్పాటు చేయబడెను.భీమడోలులోను,కురెళ్ళగూడెం లోను పరిసరప్రాంతములలోను సోదరులు బుర్రే యోహాను గారు కష్టించి దేవుని కొరకు పనిచేయుచున్నారు. ఆయన వందన సమర్పణ చేయగా జాషువా గారి ప్రార్థనతో సదస్సు ఆ రోజు ముగిసెను. ఏప్రియల్ నెల సదస్సు తాడేపల్లిగూడెంలో రాజేంద్రకుమార్ గారి వద్ద జరుగును.

కోటిపల్లి మండలం వాసాలరేవు గ్రామములో మార్చి 26,27,28 తేదీలలో సువార్త కూటములు ఘనముగా జరిగెను. స్థానికులు సంఘసభ్యులు,పరిసర గ్రామముల నుండి వచ్చిన సోదరసోదరీలతో కూటము జరిగిన ప్రాంగణము నిండియుండగా పలువురు సువార్తికులు సత్యవాక్యమును బోధించిరి. ఆ కూటములలో బి.సత్యనారాయణ (వాసాలరేవు), పి.డి.బిషప్ (మండపేట), యమ్.ఆల్‌ఫ్రెడ్(రామచంద్ర పురం),యస్.సామ్యూల్‌రాజు(కోటిపల్లి కోట)మరియు జాషువాగూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి.కూటములకు హాజరైన వారందరికీ ఆత్మీయాహారము,భౌతిక ఆహారము కూడా సమృద్ధిగా అందించబడెను.స్థానిక సువార్తికులు బి.సత్యనారాయణ గారు, స్థానిక సంఘము,కుటుంబసభ్యులు కష్టపడి పనిచేసి కూటములను సమర్ధ వంతముగా నడిపించిరి.వాసాలరేవులో **క్రీస్తుసంఘము** చక్కటి ఆలయమును కూడ నిర్మించుకొని ప్రభువుపనిలో నమ్మకముగా కొనసాగుచున్నారు.


## సత్యవాణి టి.వి.కార్యక్రమములు

**ప్రతి ఆదివారం సాయంత్రము 6:00గం॥లకు - శుభవార్త లో**

**ప్రతి బుధవారం సాయంత్రము 6:30గం॥లకు - రక్షణ లో**

**ప్రతి గురువారం మధ్యాహ్నం 2:30గం॥లకు - రక్షణ లో**

**ప్రతి శనివారం ఉదయం 8:00గం॥లకు - ఆరాధన లో**

తప్పక చూడండి.!!

# మీకొకగొప్పసదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్ధులకు, బోధకులకు, తర్భీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.


**Satya Vani**

#7-9-35, Sambamurth Street,

Kakinada - 533 004. Ph: 0884 - 2363722



RNI Regd. No. 69973/98

Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To

From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004